క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా

రామడుగు: మండలంలోని వెలిచాల సరస్వతి పాఠశాల విద్యార్థి దైవాల ప్రణీశ్ 45వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థాయిలో రాణించాడని పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు నుంచి పాల్గొన్నాడని, ప్రణీశ్, కోచ్ సాయికృష్ణను సోమవారం అభినందించారు. కార్యక్రమంలో కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కీర్తన అన్నారు. సోమవారం మండలంలోని చెల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీసీఈసీ ప్రోగ్రాంలో భాగంగా 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, జీసీఈసీ ప్రతినిధి ఆఫ్లా ఇమ్రానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు సన్మానం



పద్మ, స్వప్నను సన్మానిస్తున్న తహసీల్దార్ భిక్షపతి

గన్నేరువరం: మహిళా దినోత్సవం పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న పద్మ, స్వప్నను తహసీల్దార్ భిక్షపతి సోమవారం శాలువాలతో సన్మానించారు. మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్‌ఐ రజినీస్, జూ.. అసిస్టెంట్ చంద్రారెడ్డి, వీఆర్‌ఏలు బాల్‌రాజు, స్వామి, మల్లేశం పాల్గొన్నారు.

కదనభేరి సభను విజయవంతం చేయాలి

హుజూరాబాద్: కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించే మాజీ సీఎం కేసీఆర్ కదనభేరి సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ, హుజూరాబాద్ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు కోరారు. హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక కావాలంటే కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి నిధులను తీసుకురాని బండి సంజయ్‌కి ఎలా ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలకే ప్రజలు, రైతులకు కష్టాలు ఎక్కువయ్యాయని, ఏ సమస్యను పరిష్కరించకుండా మాటలతో కాలయాపన చేస్తుందని, మూడు నెలల్లోనే ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రావు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీపై విచారణ చేయాలి

రామడుగు: చొప్పదండి నియోజకవర్గంలో మైనార్టీశాఖ ఆధ్వర్యంలో పేద మహిళలకు అందజేసిన కుట్టుమిషన్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని, దీనిపై తక్షణం విచారణ చేయాలని మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్ ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. మైనార్టీశాఖ లబ్ధిదారులను ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తర్వాత బీఆర్‌ఎస్ నాయకులు పక్కదారి పట్టించారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తిమ్మాపూర్: వంట గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ ఒక్కసారిగా డివైడర్ ఎక్కి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అవతలి వైపున వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటన కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ వద్ద కరీంనగర్–హైదరాబాద్ రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వస్తున్న భారత్ పెట్రోలియంకు సంబంధించిన లారీ అల్గునూర్‌లోని నర్సరీల వద్దకు చేరుకోగానే లారీ డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని అవతలి వైపు రోడ్డుపైకి దూసుకువెళ్లి కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును ఢీకొంది. సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. తెల్లవారుజామున సంఘటన జరగగా పెను ప్రమాదం తప్పింది. ఎల్‌ఎండీ పోలీసులు ఘటన స్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

దొంగలు దొరికేనా..?

- బేతిగల్‌లో వరుస చోరీలు.. ఛేధనలో పోలీసుల విఫలం
- తాళం వేసిన ఇళ్లే టార్గెట్
- పోలీసులకు సవాల్‌గా మారిన చోరీలు

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలో ఏడాదిగా జరుగుతున్న వరుస దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. రెండు, మూడు రోజులు ఇంటికి తాళం వేసిన ఇళ్లనే ఎంచుకుంటున్నారు. తీరా వాళ్లు ఇంటికి వచ్చి చూసే సరికి ఉన్నది దోచుకుపోతున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏడాదిలో ఏకంగా ఆరు చోరీలు జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు ఒక్క కేసును కూడా పోలీసులు ఛేధించకపోవడంపై విమర్శలువెలువడుతున్నాయి. ఎంతో టెక్నాలజీ ఉన్న పోలీసుశాఖ వరుస దొంగతనాలపై ఎందుకు దృష్టి సాధించడం లేదనే అనుమానులు రేకెత్తిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఎస్సై వంశీకృష్ణ క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. నిందితులను పట్టుకునే సమయంలో రెండు రోజుల క్రితం కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు. అతని స్థానంలో శుక్రవారం తోట తిరుపతి బదిలీపై వచ్చారు. అయితే వరుస దొంగతనాలు కొత్త ఎస్సైకి సవాల్‌గా మారాయి.



రమణారెడ్డి ఇంట్లో వస్తువులను పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)



అంతా ఒక్కడేనా..?

వరుస చోరీలకు పాల్పడిన వ్యక్తి గ్రామస్తుడేనని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల జరిగిన చోరీల్లో ఒక్కడే పాలుగొన్నట్లు ఫింగర్ ప్రింట్స్ ద్వారా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. అయితే ఆ దొంగ ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. పోలీసులకు అంతుచిక్కకుండా దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే ఇళ్లను మాత్రమే టార్గెట్ చేయడంతో ప్రజలు ఇంటికి తాళం వేయడానికే జంకుతున్నారు.

వరుస దొంగతనాలు

- రమణారెడ్డి అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కూతురు వద్దకు వెళ్లాడు. నాలుగు రోజుల తర్వాత ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. సంఘటన వారం కిందట జరిగింది.
- 20రోజుల క్రితం చొక్కయ్య అనే వ్యక్తి కూడా ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళం పగల గొట్టి ఉంది. విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి.
- ఆరు నెలల క్రితం దామోదర్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి షోలాపూర్‌కు వెళ్లాడు. ఇంటికి వచ్చే సరికి విలువైన వస్తువులు దోసుకెళ్లారు.
- ఏ నెలల క్రితం బోజనపల్లి సత్యానారాయణ ఇంటికి తాళం వేయగా ఇదే తరహాలో దొంగతనం జరిగింది. తాళం పగలగొట్టి చోరీకి పాల్పడగా బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు అప్పటి ఎస్సైకి ఫిర్యాదు చేశాడు.
- కొక్కిరాల వెంకట్‌రావు ఇంట్లో కూడా దొంగలపడి విలువైన పత్రాలు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. ఇవ్వే కాక మరో రెండు కేసులు కూడా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికైన పోలీసులు విచారణ జరిపి చోరీలకు పాల్పడ్డ నింధుతులను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కమనీయం.. గిరిజా మృత్యుంజయుడి కల్యాణం





కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు మహేశ్వరశర్మ , పురుషోత్తం, హాజరైన ఎంపీపీ వనిత ,భక్తులు

తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీ గిరిజామృత్యుంజయ మహాదేవాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీగిరిజామృత్యుంజయ మహాదేవుడి కల్యాణం వైభవంగా జరిపించారు. గిరిజా గోశాల ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ బ్రహ్మశ్రీ వేదమూర్తులు పురాణం మహేశ్వరశర్మ, ఆలయ అర్చకుడు పురుషోత్తం మిశ్రా ఆధ్వర్యంలో ఉదయం నుంచి పలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర ఆలయం తరఫున పట్టువస్త్రాలు అర్చకుడు గోవర్ధన శ్రీకాంతాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు సమర్పించారు. వేడుకను తిలకించేందుకు మండలంతో పాటు కరీంనగర్ నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ చల్ల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆలయం నిర్మించి నేటితో 15 ఏళ్లు పూర్తయినట్లు తెలిపారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కల్యాణంలో ఎస్సారెస్పీ ఈఎన్సీ శంకర్, ఎస్ఈ శివకుమార్, కోశాధికారి గజవెల్లి బాలకిషన్ రావు, సహాయ కోశాధికారి బట్టు కరుణాకర్, ఎంపీపీ కేతిరెడ్డి వనీతదేవేందర్ రెడ్డి, శ్రీకాంత్ శర్మ, వొంటెల రవీందర్ రెడ్డి, పోలు కిషన్, గంగారపు రమేష్, చారి, భక్తులు పాల్గొన్నారు.

అర్చకుల నిరసన



ఆలయం ఎదుట నిరసన తెలుపుతున్న అర్చకులు

చొప్పదండి: పట్టణంలోని శివకేశవస్వామి ఆలయ అనువంశిక అర్చకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని శివకేశవస్వామి ఆలయం ముందు నిరసన తెలిపారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న సమయంలో అలయ అభివృద్ధి కమిటీ పేరిట కొందరు అనువంశిక అర్చకులను దొంగలు అంటూ వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. ఏళ్లుగా భగవత్ సన్నిధిలో సేవలు అందిస్తున్న అర్చకులను కించపరచడం తగదన్నారు. అర్చకులకు మద్దతుగా ఆలయ ముదిరాజ్ పల్లకి సేవ కమిటీ, నాయీబ్రాహ్మణ, రజక సేవా కమిటీలు మద్దతు పలికాయి. నిరసనలో సింహాచలం ప్రభాకరచార్యులు, జనగామ సత్యనారాయణ, ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు సంపత్, జనగామ రాఘవులు, సింహాచలం మురళి, సింహాచలం జగన్‌మోహన్ స్వామి, రాము, కన్నయ్య, మల్లిఖార్జున్, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయడంతోనే అధికారం

- కార్యకర్తలకు రుణపడి ఉంటా
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ఎంపీపీ సులోచనను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మానకొండూర్: కాంగ్రెస్ గెలుపులో భాగస్వాములైన కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సుప్రీం ఫంక్షన్ హాల్లో మానకొండూరు ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అంకితభావంతో పని చేయడంతోనే అధికారంలోకి వచ్చామని, బీఆర్ఎస్ నియంతృత్వాన్ని తరిమికొట్టిన ఘనత కార్యకర్తలదేనని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో చేసిందేమి లేదని విమర్శించారు. ఎంపీపీ సులోచన, మండల అధ్యక్షుడు రవీంద్ర చారి, మండల మహిళా అధ్యక్షురాలు దేవేంద్ర, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి మహిళా ఉద్యోగులతో ఎంపీపీ సులోచన అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఐసీడీఎస్ సీడీపీఓ సబిత ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపీపీని, మహిళా ఉద్యోగులను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం బలోపేతానికి ప్రభుత్వం కృషి

మండలంలోని దేవంపల్లి గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో గోదాం, 8 లక్షలతో మీటింగ్‌హాల్‌కు మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం భూమి పూజ చేశారు. ప్రాథమిక సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు కావలసిన ఎరువులను సొసైటీ ద్వారా తీసుకుంటే మద్దతు ధరకు లభిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సహకార సంఘాలు గణనీయంగా దోహదపడతాయని, రాష్ట్ర, ప్రైవేట్ రంగాలు పెద్దగా చేయలేకపోయిన వ్యవసాయ రుణాలను నిధులను ఇది అందిస్తుందని ఇది వ్యవసాయ రంగానికి వ్యూహాత్మక ఇన్‌పుట్‌లను అందిస్తుందన్నారు. అనంతరం పోచంపల్లి మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదర్శ పాఠశాలలో పరిసరాలు పరిశీలించి అపరిశుభ్రంగా ఉన్నాయని ప్రిన్సిపాల్ అర్చనా ప్రియదర్శినిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు కనిరెడ్డి లతప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పాకాల రాజేందర్ రెడ్డి కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవీంద్రచారి, నాయకులు గసికంటి సంపత్, మర్రి ఓదెలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శంకరపట్నం: మహిళలు కళల్లో రాణించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. మొలంగూర్ శివారులోని ఓఫంక్షన్ హాల్‌లో సోమవారం జిల్లా సాంస్కృతిక మహిళా కళాకారుల సంస్థల సమాఖ్య సంఘం వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అలిశెట్టి ప్రభాకర్ రచించిన కవితలను ఇంగ్లిష్‌లోకి మనోజ్‌కుమార్ అనే రచయిత అనువదించగా కేంద్రసాహిత్య అవార్డు గ్రహీత వరాల ఆనంద్, ఎమ్మెల్యే ఆయన సతీమణి అనురాధ కలిసి ఆవిష్కరించారు. మహిళా డప్పు కళాకారులు, కూచిపూడి నృత్యం చేసిన మహిళలను, మెమోంటో, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, బసవయ్య, మహిళలు, కళాకారులు పాల్గొన్నారు.

నేడు మండల సభ

గన్నేరువరం: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ లింగాల మల్లారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా, డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

నియామకం



శంకర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీ గునుకులకొండాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా నాగపూరి శంకర్‌గౌడ్ నియామకమయ్యారు. ఈమేరకు పార్టీ నాయకులు సోమవారం గ్రామంలో సమావేశమై ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దొమ్మటి మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా బండి రాజయ్య, కార్యదర్శిగా కొంకటి అశోక్, సలహాదారుడిగా కొర్వి కొమురయ్య, కార్యవర్గ సభ్యులుగా సంపంగి కుమార్, మనూరు వెంకటయ్య, బోయిని కనుకయ్య, న్యాలపట్ల నర్సయ్య, కొర్వి బాలయ్య, కొర్వి రామస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ న్యాలపట్ల కనకయ్యకు నాగపూరి శంకర్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆన్‌లైన్‌లో వివరాల నమోదు

రామడుగు: ప్రజాపాలనలో పలు సంక్షేమ పథకాల లబ్ధికోసం గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొందరు లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకాకపోవడంతో అధికారులు గృహజ్యోతి, మహాలక్ష్మీ ఆన్‌లైన్ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టారు. దరఖాస్తుదారుల నుంచి ఆధార్, విద్యుత్, గ్యాస్ కనెక్షన్ వివరాలు తీసుకొని ఆన్‌లైన్ చేస్తున్నారు. ఒక్క కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో చాలా మంది గంటల కొద్ది వేచి చూడాల్సిన పరిస్థితి. మరికొన్ని కేంద్రాలను ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్థిక సాయం

చొప్పదండి: పట్టణంలోని పన్నెండో వార్డుకు చెందిన బత్తిని శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్ సోమవారం రూ. 5 వేలు, బత్తిని సంపత్ గౌడ్ రూ. 2 వేలు అందించారు. కార్యక్రమంలో సాయి, మధు, వెంకటేశ్, శ్రీనివాస్‌గౌడ్, సాయి గణేశ్, శ్రీనివాస్, మల్లేశం, కనుకయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు పెడితే చర్యలు



గ్రామంలో ప్రత్యేక బలగాల కవాతు

హుజూరాబాద్‌రూరల్: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ అన్నారు. మండలంలోని పెద్దపావయ్యపల్లి గ్రామంలో సోమవారం కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ బొల్లం రమేశ్, సీఐఎస్‌ఎఫ్ ఆఫీసర్స్, జవాన్లు, ఎస్‌ఏటీ స్పెషల్ టీం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్

మానకొండూర్: జీవితాన్ని అందంగా మలుచుకోవాలని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ సూచించారు. మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాలలో ఏడురోజులపాటు వాగేశ్వరి, డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో వివిధ కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. మంచివారితో స్నేహం, మేధావుల సూచనలతో ఎదగాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొట్లకిషన్ , నాగేశ్వరి కళాశాల చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి కొండా రవి యాదవ్ వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

రాంపూర్ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట రాంపూర్ వాసుల ధర్నా

కరీంనగర్: హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి జయంధర్‌ను సస్పెండ్ చేయాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాడుగుల ఓదెలు డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన ఎస్సీ కులస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1975లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అప్పటి ప్రభుత్వం రాంపూర్ ఎస్సీలకు ఇళ్ల స్థలాల కోసం గ్రామంలోని 700 సర్వే నంబర్‌లో 30 గుంటల స్థలం కేటాయించగా హద్దులు నిర్ణయించకుండానే మరొకరికి పట్టా చేసేందుకు పంచాయతీ కార్యదర్శి సహకరించారని ఆరోపించారు. ఆర్డీవో విచారణ చేపట్టి, సదరు భూమిని దళితులు ఇళ్ల నిర్మించుకునేందుకు ఇవ్వాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్షా సామగ్రి అందిస్తున్న సుగుణాకర్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం తుమ్మనపల్లి పీఏసీఎస్ చైర్మన్ కౌరు సుగుణాకర్ రెడ్డి పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. పది పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చి మంచి మార్కులను సాధించాలన్నారు.కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లిలో సింగపూర్ వీఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ఎస్ఎస్ఎస్ శిబిరాన్ని ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వీఎస్‌ఆర్ ప్రిన్సిపాల్ హనుమకుమార్, కార్యదర్శి శ్రీలక్ష్మీ, టీచర్ కవిత, మాజీ సర్పంచ్ రాములు, ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి, సభ్యులు అశోక్, కోమల, హరీశ్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు. వాగులో నుంచి ఇసుక ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని, అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు



శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు శివారులో సోమవారం హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్ కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. కరీంనగర్‌లో జరిగిన మున్సిపల్ సమావేశంలో పాల్గొని తిరిగి కారులో హుజూరాబాద్‌కు బయలు దేరారు. కొత్తగట్టు శివారులోకి రాగానే కారు డ్రైవర్ కిరణ్‌కు ఫిట్స్ రావడంతో కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిది. ప్రమాదం నుంచి కమిషనర్ సమ్మయ్య, డ్రైవర్ క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న కేశవపట్నం బ్లూకోల్ట్స్ హెడ్‌కానిస్టేబుల్ లతీఫ్ ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పొలాల్లోకి దూసుకెళ్లిన కారును క్రేన్ సహాయంతో బయటికి తీశారు.

ఆవుల అపహరణ



ఫిర్యాదు చేస్తున్న నాగేశ్వర్‌రెడ్డి, వెంకటాద్రిస్వామి

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ తాపాల లక్ష్మీనరసింహస్వామి అర్చకుడు తిరునగిరి వెంకటాద్రిస్వామి, ఆలయ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, ఎడ్ల లక్ష్మారెడ్డికి చెందిన ఐదు ఆవులను అపహరించారు. వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న ఆవులను ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని, ఉదయం ఆవులు కనిపించకపోవడంతో ఎల్‌ఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

ప్రహరీ నిర్మించాలని వినతి



వినతిపత్రమిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రహరీ నిర్మించాలని ప్రిన్సిపల్ రాజశేఖర్‌కు పీడీఎస్‌యూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడికుమార్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, బయటి వ్యక్తులు లోనికి రావడం వల్ల విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారని, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, జక్కుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

షాపింగ్ వ్యవహారం కొలిక్కి

చొప్పదండి: పట్టణంలోని మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారం కొలిక్కి వస్తోందని ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ సింగిరెడ్డి క్రిష్టారెడ్డి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ గదుల కోసం గతంలో డిపాజిట్లు చెల్లించిన వారు గదుల కోసం కోర్టుకు వెళ్లారని తెలిపారు. ఆరేళ్లగా వివాదంలోఉన్న షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారంపై కోర్టు తుది తీర్పు ఇచ్చిందన్నారు. కక్షిదారులకు కేటాయింపులు సరికాదని, డిపాజిట్లు అర్ధ రూపాయి వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని, ఫర్నిచర్ అప్పగించాలని తీర్పు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. డిపాజిట్లు సేకరించినా అప్పటి పాలక వర్గం ఎలాంటి అగ్రిమెంట్ చేయక పోవడంతో దుమారం చెలరేగిందని, బహిరంగ మార్కెట్‌లో అద్దెలను గుర్తించి మండల పరిషత్‌కు ఆదాయం వచ్చేలా చూడాలని కోరారు. షాపింగ్ కాంప్లెక్స్ వ్యవహారం కొలిక్కి వచ్చేందుకు కృషి చేసిన ఎంపీటీలకు, పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి



వినతిపత్రమిస్తున్న కురుమ సంఘం నాయకులు

రామడుగు: రెండో విడుత గొర్రెల పంపిణీ తక్షణం చేపట్టాలని ప్రజావాణిలో కురుమ సంఘం నాయకులు అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. డీడీలు చెల్లించి అప్పులపాలు కావాల్సిన పరిస్థితి వచ్చిందని, ప్రభుత్వం స్పందించి గొర్రెలు పంపిణీ చేసి ఆదుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎల్కపల్లి లచ్చయ్య, మండల అధ్యక్షుడు కడారి వీరయ్య, జిల్లా కురుమ సంఘం పంచాయతీ విభాగం అధ్యక్షుడు కోరె గట్టయ్య, నాయకులు కచ్చు లింగయ్య, పెద్దిగారి మహేశ్, కొంరయ్య, శేఖర్, మల్లయ్య,వ పలువురు పాల్గొన్నారు.